thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 120| జగిత్యాల | గురువారం 30 జూలై, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

వెస్టిండీస్ చేతిలో పాక్ కు షాక్





## కాళేశ్వరంపై కేటీఆర్ మాటలు సిగ్గుచేటు

### వారి హయాంలోనే కట్టడం.. కూలడం చూశాం

- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు.

# ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం



- సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్తాం
- పారదర్శకంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక
- డిప్యూటీ సీఎం భట్టి
- ఢిల్లీలో ముగిసిన టీపీసీసీ సమన్వయ కమిటీ భేటీ

వివరాలు 2లో..

భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఓటు హక్కే మూలస్తంభమని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన టీపీసీసీ సమన్వయ కమిటీ సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పార్టీ-ప్రభుత్వ సమన్వయం, ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమం, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

– న్యూఢిల్లీ, జూలై 29 (ఉద్యమ కెరటం)




## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపీలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బీజేపీ ఎంపీల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం




- మూజువాణి ఓటుతో గ్రీన్ సిగ్నల్
- రెండు రోజుల వాడీవేడి చర్చల తర్వాత ఆమోదం

4



3

## రేవంత్, కిషన్ రెడ్డి వల్లే ప్రమాదంలో సింగరేణి అస్తిత్వం

బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదు

టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటి?

ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శ

# వాయుగుండం ప్రభావం

తెలంగాణలో భారీ వర్షాలు.. ▪ పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో మరో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయుగుండం ప్రస్తుతం ఉత్తర ఒడిశా-గంగానది పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోందని అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు కూడా చురుగ్గా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

2





## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

2



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

- పర్యావరణ అనుమతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం

2

## ట్రైనీ ఐపీఎస్ కృష్ణారెడ్డికి 14రోజుల రిమాండ్



- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను ఘోరంగా వేధించినట్లు రుజువులు

2




## పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు

పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి వెల్లడించింది.

2

## 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. నేడు (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది.



4

## హోర్ముజ్‌లో నౌకలపై దాడులను ఖండించిన భారత్

- భారతీయ నావికుడి మృతిపై తీవ్ర ఆందోళన
- ఇరాన్‌కు దౌత్యపరమైన నిరసన

4





# ప్రాజెక్టులకు భారీ ఊరట

## పర్యావరణ అనుమతులు చెల్లుబాటు

## సుప్రీంకోర్టులో ఉపశమనం

**న్యూఢిల్లీ, జూలై 29:** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# వాయుగుండం ప్రభావం

## తెలంగాణలో భారీ వర్షాలు..

## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, జూలై 29:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో మరో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయుగుండం ప్రస్తుతం ఉత్తర ఒడిశా-గంగానది పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోందని అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు కూడా చురుగ్గా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. గడిచిన 24 గంటల్లో ములుగు, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెంటీమీటర్లు, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెంటీమీటర్లు, మెదక్‌లో 7.68 సెంటీమీటర్లు, శంకరంపేటలో 6.71 సెంటీమీటర్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పాలెంలో 6.90 సెంటీమీటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు, జలాశయాలు నిండుకుండలా మారగా, కొన్ని ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. వరద ఉద్ధృతితో కొన్ని రహదారులు దెబ్బతిని వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో కూడా ఆకాశం మేఘావృతంగా ఉండటంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో ఎల్‌నినో ప్రభావంతో జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలో సాధారణం కంటే 49 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయానికి 33.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ కృష్ణారెడ్డికి 14రోజుల రిమాండ్

## చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 29:** తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, శారీరక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మిర్యాలగూడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయనను ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించగా, అనంతరం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆగస్టు 11 వరకు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయనను భారీ భద్రత మధ్య చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత అధికారిణికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో శారీరక దాడి జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు సమాచారం. ఆమె గొంతు భాగంలో నులిమిన ఆనవాళ్లు, చెంపపై గాయాలు, ఎడమ కాలిపై గాయాలు ఉన్నట్లు వైద్య నివేదికలో నమోదైనట్లు తెలుస్తోంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ ద్వారా లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, తమ మధ్య సంబంధం ఉందంటూ తోటి ట్రైనీ అధికారుల వద్ద తప్పుడు ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. మరో అధికారితో తనకు అక్రమ సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేసి పరువు తీసేందుకు ప్రయత్నించాడని ఫిర్యాదులో ఆరోపించారు. అంతేకాకుండా, తన అనుమతి లేకుండా వ్యక్తిగత వీడియోలు రికార్డు చేసి వాటి ఆధారంగా బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపించి మానసిక వేదనకు గురిచేశాడని బాధితురాలు పేర్కొన్నారు. తన మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తీసుకుని పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ నెల 9న రాత్రి తనను బలవంతంగా గదికి తీసుకెళ్లి బంధించి, జుట్టు పట్టుకుని లాగడంతో పాటు గొంతు నులిమేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. తనను అవమానించే ఉద్దేశంతో కండోమ్ ప్యాకెట్లు విసిరాడని, మరుసటి రోజు కూడా శారీరక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అకాడమీలో ఇతరుల సమక్షంలో కూడా అసభ్యకరంగా మాట్లాడి పరువుకు భంగం కలిగించాడని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, కేసులో సేకరించిన ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

# ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే మూలస్తంభం

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్తాం
- పారదర్శకంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- దిల్లీలో ముగిసిన టీపీసీసీ సమన్వయ కమిటీ భేటీ



**న్యూఢిల్లీ, జూలై 29 (ఉద్యమ కెరటం) :** భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి పౌరుడి ఓటు హక్కే మూలస్తంభమని, అర్హుడైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దిల్లీలోని ఏఐసీసీ జాతీయ కార్యాలయం ఇందిరా భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన టీపీసీసీ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ భేటీ ముగిసిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై విస్తృత చర్చ జరిగిందని, పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రత్యేక ఓటరు నమోదు (ఎసఐఆర్) ప్రక్రియపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎలఏలు) అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారి పనితీరును ఏఐసీసీ సైతం సమీక్షించి అభినందించిందని చెప్పారు. మిగిలిన ఓటరు నమోదు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారన్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ కేడర్, సంస్థాగత వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ చేర్చేందుకు సమావేశంలో ఒక ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు ఆయన వివరించారు. రాబోయే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమన్వయ కమిటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ముందుగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును వేగవంతం చేయడంతోపాటు ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావహుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మంత్రులు తమ జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు(డీసీసీ), ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా చర్చించి ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను అధిష్ఠానానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తంగా ఓటరు నమోదు, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై భేటీలో స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుని వాటి అమలుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు. 'సర్'పై సమీక్షించామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎలఏలను నియమిం చినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని, రెండుమడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హత గల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని చెప్పారు. ఈసారి 'సర' పక్రియ దురుద్దేశంతో జరుగుతున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, సీతక్క, ఏఐసీసీ సెక్రటరీ వంశీచందర్ రెడ్డి, పలువురు ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కేటీఆర్ మాటలు సిగ్గుచేటు

- వారి హయాంలోనే కట్టడం.. కూలడం చూశాం
- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, జూలై 29:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేగిలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేగీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్‌ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాగీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷-లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్‌ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్‌ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్‌ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

# తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

## పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు

## 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల

**హైదరాబాద్, జూలై 29 :** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ÷ర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల పక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.




# దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

## 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి

## దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 29:** దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతులు మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ గీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ సేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణాలు పెంచాలి
- ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 29:** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ-సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ-సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా అంబర్‌పేట మహంకాళి బోనాలు

- ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి
- ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు



**హైదరాబాద్, జూలై 29:** అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న అంబర్ పేట్ మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాలు జరగనున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ట్రాన్స్ కో, పోలీస్, జలమండలి, వైద్యారోగ్యశాఖ, కల్చరల్ డిపార్ట్‌మెంట్‌లు సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ బోనాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బోనాల ఉత్సవాలను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరుగుతున్నాయని అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొ÷-టటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో శాసనమండలి సభ్యులు బల్మూర్ వెంకట్, బిసి సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయదేవి, ఎస్ పిడిసిఎల్ ఎం.డి.జితేష్ వి.పాటిల్,సమాచార,పౌర సంబంధాలశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ జిఎం, ఆర్‌టిసి ఇడి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

## పెద్దలకు అండగా హైడ్రా పనితీరు

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జూలై 29:** హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసి వేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సు-ధీర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాకు అందమైన భాష్యం చెప్పి తమ ఇష్టాలకు అనుగుణంగా వాడుకుంటూ పెద్దల భూములు రక్షించుకుంటూ.. పేదల ఇండ్లు కూలగొడుతూ ఎంతో మందిని రోడ్డున పడేశారని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు ఈ విషయాలు వెల్లడించారు. ప్రజలను మభ్యపెట్టడం కోసమే లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కాపాడినట్లు రంగనాథ్ అబద్దాలు చెబుతున్నారని అన్నారు. దుర్గంచెరువు వద్ద ఉన్న నెక్టార్ గా÷-డ్గ÷న్స్, ఫాతిమా కాలేజ్ లాంటి వాటి జోలికి హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని మండిపడ్డారు. హిమాయత్ సాగర్, గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇండ్ల వద్దకు హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని, కోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. రంగనాథ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద సుమోటోగా స్వీకరించాలని కోరారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడానికి హైడ్రా కూడా ఒక కారణం అని పేర్కొన్నారు. హైడ్రాను బ్లాక్ మె-యిలింగ్‌కు సాధనంగా వాడుకోవటం సబబు కాదని, సీఎం, మంత్రులు అబద్దాలు మాని పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేసీఆర్, బీఆర్ఎస్‌లను తలచుకుంటే వారికి నిద్ర పట్టడం లేదని అన్నారు. పాలన చేయకుండా నిత్యం కేసీఆర్‌ను తిట్టుకుంటూ ఎన్నాళ్లు పబ్బం గడుపుతారని వెల్లడించారు.

# ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే

## తొలుత ప్రేమించుకున్న వీరు తరవాత దూరమయ్యారు

## అయినా వేధింపులకు దిగిన ట్రైనీ ఐపిఎస్

## నగర్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్, జూలై 29:** లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కేసు నేపథ్యాన్ని సీపీ సజ్జనర్ వివరించారు. నిందితుడు, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అనంతరం యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. 2025 డిసెంబర్ నుంచి శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విజయ ప్రయాణంపై నిందితుడు చేసిన పోస్టుకు ఆమె స్పందించడంతో వీరి పరిచయం ప్రారంభమైంది. తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో వీరి సంబంధం మరింత బలపడింది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయి. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వ్యక్తిగత చాట్‌లను బహిర్గతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు, సహచరులను సంప్రదించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడి నుంచి దూరంగా ఉంది. అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయినా ఉదయ్ కృష్ణారెడ్డి వేధింపులు ఆగలేదు. కేసు దర్యాప్తులో ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిందితుడిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేస్తోందని సజ్జనర్ పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు

## ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

## హైడ్రాపై కేటీఆర్ వ్యాఖ్యలకు తుమ్మల కౌంటర్

**హైదరాబాద్, జూలై 29:** హైడ్రాపై మాగీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.



# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

## కాంగ్రెస్ బీఎల్‌ఏలకు భట్టి ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 29:** ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# ఆగస్టు 3లోగా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

## సీఈవో సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జులై 29:** ఓటరు జాబితా సవరణ కేవలం తప్పులు లేని ఓటర్ల జాబితా కోసమేనని తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ (ా×=) పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆగస్ట్ 3వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. 8 నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. గీహెచ్ఎంసీతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ తదితర పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తే బీఎల్ఓలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లన్నీ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల సమావేశాలను వీడియో తీయాలని జిల్లా కలెక్టర్లను సీఈఓ ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్‌కు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# రేవంత్, కిషన్ రెడ్డి వల్లే ప్రమాదంలో సింగరేణి అస్తిత్వం

## బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదు

## టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటి?

## ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారు

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శ




**హైదరాబాద్, జూలై 29:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

## సంపాదకీయం




# పరీక్షల బిల్లుతో సమస్య సమసిపోయేనా?

### కేవలం శిక్షలపైనే తప్ప సంస్కరణలపై లేని ప్రభుత్వ దృష్టి

### ఎన్టీఏ వైఫల్యాలు, కోచింగ్ మాఫియాపై మౌనం వీడని విపక్షాలు

### విద్యా వ్యవస్థ సమూల ప్రక్షాళనకు బలమైన ప్రజా ఉద్యమాలే మార్గం

పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేగికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాగీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాగీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేగీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేగీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈగీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేగీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్దతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ రకంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేగీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్‌ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేగీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళ్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

# పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు




**న్యూఢిల్లీ, జూలై 29:** ప్రజా పరీక్షల్లో అక్రమాల నిరోధానికి ఉద్దేశించిన యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో బుధవారం వాడీవేడీ చర్చ జరిగింది. ఈ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారానికి దారితీశాయి. విద్యార్థుల నిరసనలు, ప్రశ్నపత్రాల లీకేగీలు, విద్యా వ్యవస్థ, ఆర్ఎస్ఎస్ పాత్రపై ఆయన చేసిన విమర్శలకు అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆయన ఉపయోగించిన "ఇడియట్" అనే పదాన్ని బీజేపీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేయగా, స్పీకర్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. బిల్లుపై చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌తో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని అన్నారు. ఢిల్లీ వీధుల్లో జరిగినది నిరసన కాదని, అది విద్యార్థుల భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, పెల్లెట్ గన్స్ ప్రయోగించడం ఎందుకని ప్రశ్నించారు. ఈ చర్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఆరోపిస్తూ, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తున్నారని, ఆర్ఎస్ఎస్ ప్రభావం విశ్వవిద్యాలయాల వరకు విస్తరించిందని రాహుల్ ఆరోపించారు. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ప్రతీక మాత్రమేనని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ వ్యవహారంలో ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలను, వారి పిల్లలను అడిగితే తెలుస్తుందని చేసిన వ్యాఖ్యలు అధికార పక్ష సభ్యుల్లో ఆగ్రహానికి దారితీశాయి. రాహుల్ ప్రసంగానికి మధ్యలోనే పలుమార్లు బీజేపీ ఎంపీలు అడ్డుపడగా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హోంమంత్రి అమిత్ షాపై ఆరోపణలు చేయడానికి రాహుల్ వద్ద ఆధారాలేమిటని ప్రశ్నించిన ఆయన, వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పేరుతో సభలో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. దీనికి ప్రతిస్పందించిన రాహుల్ గాంధీ, తాను ఎంపీలను వ్యక్తిగతంగా విమర్శించలేదని, బీజేపీ సభ్యులు కావాలనే తన ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారని అన్నారు. సభలో కేవలం అధికార పక్ష సభ్యులే మాట్లాడాలనుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. దీంతో కొంతసేపు సభలో గందరగోళం నెలకొంది. చివరకు స్పీకర్ జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### మూజువాణి ఓటుతో గ్రీన్ సిగ్నల్

### రెండు రోజుల వాడీవేడి చర్చల తర్వాత ఆమోదం




**న్యూఢిల్లీ, జూలై 29:** నీట్, జేఈఈ సహా పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేగీలు, అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) సవరణ బిల్లు-2026' (యాంటీ పేపర్ లీక్ బిల్లు)కు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. రెండు రోజుల పాటు సుమారు 10 గంటలపాటు సాగిన వాడీవేడి చర్చల అనంతరం బిల్లుకు సభ ఆమోదం లభించింది. అనంతరం లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. బిల్లుపై జరిగిన చర్చలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగం సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. ఆయన ఉపయోగించిన "ఇడియట్" అనే పదంపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా, ఆ వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖను ఆర్ఎస్ఎస్ ప్రభావితం చేస్తోందని, విద్యార్థులను అంధభక్తులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని రాహుల్ చేసిన ఆరోపణలు కూడా అధికార పక్ష సభ్యుల నిరసనకు దారితీశాయి. ఇక బిల్లుకు మద్దతుగా మాట్లాడిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నపత్రాల లీకేగీలు, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం దోహదపడుతుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా పరీక్షల పారదర్శకతను కాపాడడం, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రెండు రోజుల చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# హోర్ముజ్‌లో నౌకలపై దాడులను ఖండించిన భారత్

### భారతీయ నావికుడి మృతిపై తీవ్ర ఆందోళన..

### ఇరాన్‌కు దౌత్యపరమైన నిరసన



**న్యూఢిల్లీ, జూలై 29:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో భారతీయ నావికుడు ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతంలో సైనిక చర్యలను వెంటనే నిలిపివేసి, ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిచ్చింది. పశ్చిమాసియా పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన బహిరంగ చర్చలో ఐరాసలో భారత్ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ మాట్లాడారు. కొద్దికాలం ప్రశాంతత తర్వాత మళ్లీ హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'గీఎఫ్ఎస్ గెలాక్సీ', 'ఎంటీ అల్ బహియా', 'ఎంటీ మొంబాసా' నౌకలపై జరిగిన దాడులు భారతీయులపై ప్రత్యక్ష ప్రభావం చూపాయని తెలిపారు. ఈ ఘటనల్లో ఒక భారతీయ నావికుడు మరణించగా, మరొకరు అదృశ్యమైనట్లు, పలువురు గాయపడినట్లు భద్రతా మండలి దృష్టికి తీసుకెళ్లారు. అంతర్జాతీయ జలసంధుల్లో వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత, సురక్షిత రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని భారత్ స్పష్టం చేసింది. పౌర నౌకలు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం వెంటనే నిలిపివేయాలని కోరింది. ఈ ఘటనపై నిరసనగా న్యూఢిల్లీలోని ఇరాన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌కు భారత ప్రభుత్వం సమన్లు జారీ చేసింది. భారతీయ పౌరుడి మరణం, ఇతరులు గాయపడిన ఘటనపై తీవ్ర దౌత్యపరమైన నిరసనను తెలియజేసినట్లు విదేశాంగ వర్గాలు వెల్లడించాయి.




# 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 29:** జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. నేడు (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

# రైతులు-విద్యార్థుల ఉమ్మడి పోరాటానికి కసరత్తు

### రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నేత అశుతోష్ భేటీ.. ■ సంయుక్త వేదిక ఏర్పాటుపై చర్చ



**న్యూఢిల్లీ, జూలై 29:** రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఉమ్మడి పోరాటం చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం రైతు సంఘాలతో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సీజేపీ ప్రతినిధి అశుతోష్‌తో పాటు ఇతర విద్యార్థి నేతలు మంగళవారం భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకుడు రాకేశ్ టికాయత్‌తో సమావేశమయ్యారు. రైతులు, విద్యార్థులు, యువతను సమన్వయం చేస్తూ సంయుక్త వేదిక ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించే అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం అశుతోష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు, విద్యార్థులు, యువత కలిసి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని రాకేశ్ టికాయత్‌ను కోరినట్లు వెల్లడించారు. విద్యార్థుల ఉద్యమాలకు రైతు సంఘాల మద్దతు లభించేలా చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలో ఉమ్మడి కార్యాచరణపై నిర్ణయం తీసుకునే అవకాశముందని సీజేపీ వర్గాలు తెలిపాయి.

# విశ్వబ్రాహ్మణ సంఘం గుండి గ్రామ కమిటీ ఏర్పాటు



**ఆసిఫాబాద్ రూరల్:** ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులుగా బట్టు పెల్లి రమేష్ చారి, అధ్యక్షులుగా బట్టు పెల్లి ప్రవీణ్ చారి, ఉపాధ్యక్షులుగా శేషాద్రి చారి, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్,లను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షులుగా వంశీకృష్ణ చారి, నవీణ్ చారి, అంజయ్య, కోశాధికారిగా అంజన్న, కార్యనిర్వాహక అధ్యక్షులుగా తిరుమలేష్, కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దక్షిణామూర్తి, ప్రచార కార్యదర్శిగా ఉదయ్ కిరణ్, సభ్యులుగా శ్రీనివాస్, శేఖర్, శ్రీరామ్,సతీష్,సాయి కృష్ణ, సంతోష్, సలహాదారులుగా కొండయ్య చారి,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మాజీ ఎంపీటీసీ ముంతాజ్ అలీని పరామర్శించిన కోనేరు కోనప్ప



**బెజ్జూర్:**
అనారోగ్యంతో బాధపడుతున్న బెజ్జూర్ మాజీ ఎంపీటీసీ ముంతాజ్ అలీని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కోనప్ప బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆయన నివాసానికి నేరుగా వెళ్లి పరామర్శించారు. ముంతాజ్ అలీని అడిగి ఆరోగ్య యోగక్షేమాలు తెలుసుకున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కెరమెరి:** మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, విద్యుత్ ప్రమాదాలు, నీటి ప్రవాహాలతో జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కాచి చల్లార్చిన తాగునీటిని మాత్రమే ఉపయోగించాలని, నీటి నిల్వ పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమతెరలు వినియోగించాలని పేర్కొన్నారు. వర్షాల సమయంలో తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదని, కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, తెగి పడిన, వదులుగా ఉన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలను నీటి నిల్వల వద్దకు వెళ్లనివ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేడి, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, జ్వరం, విరేచనాలు, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో వర్షాకాలంలో వ్యాధులు, ప్రమాదాలను సమర్థంగా నివారించవచ్చని వివరించారు.

# బాధిత కుటుంబానికి మున్నూరుకాపు సంఘం చేయూత



**కాగజ్నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతిచెందిన చిట్యాల కేదారి కుటుంబ సభ్యులను మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పరామర్శించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్నూరుకాపు సంఘం తరపున 25 కిలోల బియ్యం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు దెబ్బటి జలపాతి, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సాయిదామ్ అశోక్, పులిశెట్టి వెంకటేష్, చింతగూడ గ్రామానికి చెందిన మున్నూరుకాపు కులస్తులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్:**
జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , వి బి జి రామ్ జి అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ (గ్రిడ్, ఇంట్రా) అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, లీకేజీలు, సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగిస్తూ ప్రతిపాదిత పనులను వేగవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వి బి జి రామ్ జి పథకంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై తక్షణ స్పందన కనబరుస్తూ, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, జిల్లా అధికారులు కార్యక్రమాల పురోగతిపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ (గ్రిడ్ & ఇంట్రా) ఈఈలు, డి.ఈలు, ఎ.ఈ.లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఎ.పి.ఓ.లు, ఎ.పి.ఎం.లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం పడకేసింది..!

- డ్రైనేజీలు చెత్తకుప్పలాయే..!
- వాంకిడి మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా మురుగు కాలువలు



**వాంకిడి:**
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ తీవ్రంగా పడకేసింది. కాలనీలు, ప్రధాన వీధుల్లోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో కాలువలు చెత్తకుప్పలుగా మారి భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నిండిపోయిన డ్రైనేజీల నుంచి మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.పారిశుద్ధ్య కార్మికుల కొరత, పర్యవేక్షణ లోపంతోనే ఈ సమస్య తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి, డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ చేపట్టాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్:**
జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమం కొరకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి గాను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర, త్రిచక్ర వాహన లబ్ధిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం క్రింద 2025-26 సంవత్సరానికి గాను గిరిజన మత్స్యకారులకు 21 యూనిట్ల ద్విచక్ర వాహనాలు, 5 యూనిట్ల త్రిచక్ర వాహనాలు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన మత్స్యకారులు 491 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో నుండి 26 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని గిరిజన మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రభాకర్, మత్స్యశాఖ సిబ్బంది, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి





**తిర్యాణి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్ అన్నారు. తిర్యాణి మండల ఎన్నికల కన్వీనర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పులి వెంకటేష్ తో కలిసి బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలుర హాస్టల్ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి హాస్టల్లోని పరిస్థితులను పరిశీలించారు. హాస్టల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. సన్న బియ్యంతో భోజనం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అది ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. వెంటనే హామీలను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. విద్యార్థులు హాస్టల్లోని పలు సమస్యలను బీజేపీ నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి మండల అధ్యక్షుడు సారా రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు తిరుపతి, శ్రీధర్, ఆత్రం గోపాల్, మాధవి, షైనాషా, తొడసం భాస్కర్, మంగ రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**

**ఆసిఫాబాద్ :**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రాబోయే 3 రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని సూచించారు. కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సగటున 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని, తిర్యాణి మండలంలో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, లింగాపూర్, కెరమెరి మండలాలలో భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. మహారాష్ట్రలోని వార్ధా, వైన్‌గంగా ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ప్రశాంతంగా ప్రవహించే ప్రాణహిత నదిలోకి చెలిమల వాగు, ఉల్లిపిట్ట వాగుల ద్వారా భారీగా వరద నీరు చేరుతోందని తెలిపారు. మొవాడ్ వైపు నుంచి వస్తున్న వరద నీటితో వట్టివాగు ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుందని, నీటిమట్టం నిర్దేశిత స్థాయికి చేరుకోవడంతో 2 గేట్లను ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. పరిస్థితిని



ప్రతి గంటకు సమీక్షిస్తూ అవసరాన్ని బట్టి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలను నియంత్రిస్తున్నామని తెలిపారు. ఏ అత్యవసర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు మంచిర్యాల నుంచి ప్రత్యేక పోలీస్ బెటాలియన్ బృందాలు, బోట్లు, లైఫ్ జాకెట్లతో సహా కాగజ్‌నగర్‌కు చేరుకున్నాయని తెలిపారు. ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణులను ముందస్తుగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోలెవల్ వంతెనలు, వాగులు పొంగిపొర్లుతున్న ప్రాంతాల వద్ద ట్రాక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బందితో నిరంతర పహారా నిర్వహిస్తున్నామని, నీటి ప్రవాహం పూర్తిగా తగ్గే వరకు ప్రజల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. జలపాతాల వంటి పర్యాటక ప్రాంతాలలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటి లోతుపై అవగాహన లేకపోవడం, సోషల్ మీడియా కోసం రీల్స్, ఫోటోలు తీసే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వర్షాలు తగ్గిన తర్వాత కూడా జలపాతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పర్యాటక రుసుము వసూలు చేసే గ్రామ పంచాయతీలకు పర్యాటకుల భద్రత బాధ్యతలను అప్పగించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని చిల్లపూర్, బాబాపూర్, గొడవెల్లి, గుండి గ్రామాల ప్రజలతో పాటు జిల్లా ప్రజలందరూ వాగులు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించి అధికారులకు సహకరించాలని తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జిల్లాలోని వాగులు, వంకలు, నదులలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, పశువుల కాపరులు, రైతులు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు, వరదల కారణంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నం. 8500844365 ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర పరిస్థితులలో ప్రజలు ఈ నంబర్‌ను సంప్రదించి సహాయం పొందాలని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

### వరద ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి వాగు వద్ద పారుతున్న వరద ప్రవాహాన్ని కలెక్టర్ హరిత బుధవారం తహసిల్దార్ రియాజ్ అలీ , ఇతర శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. వంతెనలపై నుండి వరద నీరు పారే అవకాశం ఉన్నందున, వాహనదారులను, కాలినడకన వచ్చేవారిని వంతెన దాటకుండా అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి నివారించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు, పశువుల కాపరులు పొంగిపొర్లుతున్న వాగులు/వంకల అవతలి వైపునకు వెళ్లకూడదని సూచించారు.





# గురుపౌర్ణిమ వేడుకలతో వేంసూర్లో ఆధ్యాత్మిక శోభ

- **సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. భక్తులకు మహా అన్నదానం**

**సత్తుపల్లి:** గురుపౌర్ణిమ సందర్భంగా వేంసూర్ మండలంలోని పలు గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక సత్యవ్రతాలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీసాయి శ్రీ శక్తి పీఠంలో ఆలయ నిర్వాహకులు పుచ్చకాయల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యవ్రతాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందడంతో పాటు ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే మర్లపాడు, కందుకూరు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో కూడా గురుపౌర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా గురుపౌర్ణిమ వేడుకలు భక్తిపారవశ్య వాతావరణంలో కొనసాగాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువులకు నివాళులర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రద్దీతో ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.



# అనాథ చిన్నారులకు అండగా కోనేరు కోనప్ప

- **రూ.1 లక్ష స్కాలర్షిప్ ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే**
- **బాలిక వివాహ బాధ్యత కూడా తానే తీసుకుంటానని హామీ**

**బెజ్జూర్:** మండలంలోని అంబగట్ట గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని గ్రామానికి చెందిన ఆదె భీంరావు, తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను



పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు అండగా నిలవడం మనందరి బాధ్యత అని అన్నారు. బాలిక విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా బీఆర్ఎస్ పార్టీ తరఫున నెలకు రూ.2వేల చొప్పున 50 నెలల పాటు మొత్తం రూ.1లక్ష స్కాలర్షిప్ అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా బాలిక చదువు పూర్తయిన తర్వాత ఆమె వివాహానికి అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. పిల్లలను ఉన్నత విద్య చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అనాథ పిల్లలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అవసరమైన ప్రతి సందర్భంలో తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బందికి రెయిన్కోట్లు పంపిణీ

**జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్ తొడసం రాజేందర్ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బుధవారం రెయిన్కోట్లు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్యంతో పాటు ఇతర అత్యవసర సేవలను అందించే సిబ్బంది విధులు సజావుగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రతికూల వాతావరణంలోనూ ప్రజలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురుకాకుండా రెయిన్కోట్లు అందజేసినట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్య, మౌలిక సేవలు అందించడంలో గ్రామపంచాయతీ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**తిర్యాణి:** భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని ఎదులపాడ్ గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ మడావి పార్వతి అంబరావు అన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, అడవి ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని గ్రామస్తులకు సూచించారు. బుధవారం గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చిక్రం సూరు ఇంటి వద్ద వరద నీరు చేరి మూడు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ఆయా కుటుంబాలు భయాందోళనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సంబంధిత మండల అధికారులు వెంటనే స్పందించి, వర్షపు నీరు నిల్వకాకుండా నూతన కల్వర్టు నిర్మించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# గుంతలమయమైన ప్రధాన రహదారి



**కాగజ్నగర్:** కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామంలోని న్యూ కాలనీ వార్డు నం.1 ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారి మరింత దెబ్బతిని ప్రయాణానికి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి సమస్యను గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుడు, సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ రహదారిపై ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, రైతులు ప్రయాణిస్తున్నారని, గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని తెలిపారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి




**కెరమెరి:** ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కేరమెరి మండల అధ్యక్షుడు సుజాయత్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బూత్ నంబర్లు 116, 117, 118, 119తో పాటు కేస్లగూడ గ్రామంలోని బూత్ నంబర్ 120ను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత బీఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలతో మాట్లాడి బూత్‌ల వారీగా జరుగుతున్న నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అక్కడికి వచ్చిన పలువురు ఓటర్ల దరఖాస్తులను స్వయంగా పూరించి అందజేశారు. అవసరమైన వారికి దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓలు, బీఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజిద్ దేశముఖ్, మహమ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్, తహశీల్దార్ కార్యాలయ ఆపరేటర్ రాజు, బీఎల్ఓలు అనసూయ, అనిత, స్రవంతి, గుణసుందరి, విశ్వాస్, షేక్ అలీం, గణేష్, బీఎల్ఏలు గంటేవాడ్ మురళి రాథోడ్, సుదర్శన్, అయూబ్ ఖాన్, పొర్ల వెంకటేష్, సీనియర్ నాయకుడు సిడాం జగన్నాథ్, దండుగుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తికి చేయూత..

- మహిళా షెల్టర్ హోమ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి
- 42 మందికి రూ.12.81 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**సత్తుపల్లి:** ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవాడంతో పాటు స్త్రీ శక్తికి చేయూత నివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మహిళల భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సత్తుపల్లి మున్సిపాలిటీలోని మసీద్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉమెన్ షెల్టర్ హోమ్ – స్త్రీ శక్తి సదన్ గ్రామ వికాస్ వసతి గృహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షెల్టర్ హోమ్ నిర్వాహకులు మాట్లాడుతూ ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు, దివ్యాంగులు, అవసరాన్ని బట్టి ఇతర మహిళలకు కూడా ఈ కేంద్రంలో ఆశ్రయం కల్పించనున్నట్లు తెలిపారు. కుటుంబ కలహాల పరిష్కారానికి ప్రత్యేక కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పెనుబల్లి మండలానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.12,81,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సకాలంలో సహాయం అందుతోందని, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, షెల్టర్ హోమ్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఫౌండర్ సూర్యనారాయణ, పోలీసు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెంకుటిల్లు నుంచి కుటుంబాన్ని పునరావాస కేంద్రానికి తరలింపు



**తాండూర్:** మండలంలోని నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెర కాలనీలో అధిక వర్షాల నేపథ్యంలో ప్రమాదకర స్థితిలో ఉన్న ఓ కుటుంబాన్ని అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. బుధవారం పోలీసు అధికారుల సమాచారం మేరకు మాదారం ఎస్సై బి.సౌజన్య, నీలాయపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పోలవేణి తిరుపతి, పోలీసు సిబ్బంది వడ్డెర కాలనీలోని కన్నవేని తిరుపతి పెంకుటిల్లు కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించి, కుటుంబ సభ్యులను వెంటనే ఇంటిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సహాయక చర్యల్లో పోలీసు సిబ్బంది లచ్చు పటేల్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొని కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడంలో సహకరించారు.

## పులుల సంరక్షణకు అందరూ తోడ్పడాలి






**కెరమెరి:** పులుల సంరక్షణకు అందరూ తోడ్పడాలలని ఎఫ్ఆర్ఓ మజరుద్దీన్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. పులులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అడవులను పరిరక్షించడం, అక్రమ వేటను అరికట్టడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం ద్వారా ప్రకృతి సమతుల్యతను పరిరక్షించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులులు మన అటవీ సంపదకు ప్రతీక అని, వాటి సంరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అడవులను రక్షిస్తూ వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

## ఎస్ఐఆర్ సర్వే పరిశీలన



**కెరమెరి:** మండలంలోని కైరి గ్రామపంచాయతీ పరిధిలో బూత్ నం.110లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ ఓటర్ల వివరాల నమోదు, ధృవీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఆత్రం తిరుపతి, బీఎల్ఏ జాడి రాకేష్ సర్వే ప్రక్రియను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలని కోరారు.

## భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి





- వాగులు, వంతెనలు దాటొద్దు..
- జిల్లా ఎస్పీ నితికా పంత్

**కాగజ్నగర్:** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. రానున్న నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు వెళ్లవద్దని తెలిపారు. బుధవారం ఆసిఫాబాద్ పరిధిలోని తుంపెల్లి వాగు, గుండి వాగును పరిశీలించి పోలీసు, రెవెన్యూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు వాగులు, లో–లెవల్ వంతెనల వద్ద రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని, వరద నీరు తగ్గిన తర్వాతే ప్రజలను అనుమతించాలని పేర్కొన్నారు. భద్రత సామాగ్రి సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, నదులు, కల్వర్టులు, లో–లెవల్ బ్రిడ్జిలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు. చేపల వేట కోసం నీటి వనరుల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వరద ప్రాంతాల్లో సెల్ఫీలు, రీల్స్ కోసం వెళ్లి ప్రాణాల మీదికి తీసుకురావద్దని చెప్పారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ పోలీసు, రెవెన్యూ శాఖల సూచనలను పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## టీచర్ల నిర్లక్ష్యం.. చిన్నారుల చదువుకు ఆటంకం

- ఉపాధ్యాయులు బడికి రాక.. ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- జంగం ఉర్దూ పాఠశాలలో ఘటన






**జైనూర్:** మండలంలోని జంగం గ్రామ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో విద్యార్థులు పాఠాలు వినకుండానే తిరిగి ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన చిన్నారులు కొంతసేపు ఉపాధ్యాయుల కోసం ఎదురుచూసినా ఎవరూ రాకపోవడంతో నిరాశతో ఇంటి బాట పట్టారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. చదువు కోసం వచ్చిన విద్యార్థులు తరగతులు జరగక వెనుదిరగాల్సి రావడంతో తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు తరచూ పునరావృతమైతే చిన్నారుల విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విధులకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యా శాఖ అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## పాట్నాపూర్లో ఆధ్యాత్మిక శోభ

- గురుపౌర్ణమి సందర్భంగా జెండా పూజ



**జైనూర్:** మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ సిద్ధమహాయోగా పీఠం శ్రీ పరమహంస సద్గురు పూలజీ బాబా సంస్థాన్లో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేడుకల ప్రారంభంలో బాబా సతీమణి ఇంగిల్ దుర్పత బాయి చేతుల మీదుగా జెండా పూజ నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణ చేసి గురుపౌర్ణమి మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా ధ్యాన ధారణ నిర్వహించి గురుబోధనలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ రావు ఇంగిలే మాట్లాడుతూ పరమహంస సద్గురు పూలజీ బాబా చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ ప్రతి ఏడాది గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం తదితర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో రిటైర్డ్ అధికారి బీబీ సింగ్, కమిటీ సభ్యులు దాదారావు, సుభాష్ దుర్రే, స్థానిక సర్పంచ్ కందరే బాలాజీ లక్ష్మీ, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పటేల్ గంగాధర్, రంగారావు దంబి, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- వంద పడకల ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల:** ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం చెన్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రహరీ గోడ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్లో నిర్మాణంలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కోటపల్లి మండలం అర్జునగుట్ట సమీపంలోని ప్రాణహిత నది తీరాన్ని సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కేజీబీవీలో అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిశుభ్రతను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీల జాబితాను సిద్ధం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఇండ్లు కోల్పోయిన అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించి త్వరగా




పూర్తి చేయాలని, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణకు శాఖల సమన్వయం కీలకం



- హెచ్ఐవీ నియంత్రణకు స్క్రీనింగ్ సేవలు విస్తరించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల:** జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, జిల్లా ఎయిడ్స్ కోఆర్డినేటర్ నీలిమతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణ చర్యలను మరింత పటిష్ఠం చేస్తూ జిల్లాలో స్క్రీనింగ్ సేవలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని సూచించారు. బహుళ రంగాల కార్యాచరణ వ్యూహంలో నిర్దేశించిన లక్ష్యాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చికిత్స పరిధిలోకి రాని హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన బహిరంగ ప్రదేశాల్లో స్వీయ ప్రమాద అంచనా క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేసి స్వచ్ఛంద హెచ్ఐవీ పరీక్షలను ప్రోత్సహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ కార్మికులు, అధిక ప్రమాదం ఉన్న కార్మిక వర్గాల కోసం ప్రత్యేక ఆరోగ్య, హెచ్ఐవీ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని, హెచ్ఐవీ బాధితులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు సంబంధిత ఆన్లైన్ పోర్టల్ల ద్వారా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ నరేంద్ర రాథోడ్ జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ చర్యల పురోగతిని వివరించారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చెన్నూర్లో నూతన ఐసీటీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, లింక్ ఆర్ట్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ను వేగవంతం చేయాలి

- ఎస్ఐఆర్పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్ష

**మంచిర్యాల:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, బీఎల్ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నిబంధనలకు అనుగుణంగా చేపట్టి, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వాటి వివరాలను నమోదు చేయాలని, ఏఎస్డీ జాబితా సిద్ధమైన అనంతరం సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం



ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్లో ఇప్పటికే 81 శాతం పనులు పూర్తయ్యాయని, నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు, బీఎల్ఏలు, వాలంటీర్లు, యువత సహకారంతో ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆడే సకారం వర్ధంతి వేడుకలు

25 మంది విద్యార్థులకు రూ.2.52 లక్షల ఆర్థిక సాయం



**ఆదిలాబాద్:** సమాజ శ్రేయస్సు కోసం జీవితాంతం సేవలందించిన మాజీ ప్రధానోపాధ్యాయులు ఆడే సకారం 10వ వర్ధంతి వేడుకలను బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆడే సకారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆడే సతీష్, శ్రీకృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆడే క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆడే సకారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి కోసం ఆడే సకారం చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. చదువులో ప్రతిభ కనబర్చిన, ఆర్థికంగా వెనుకబడిన 25 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,116 చొప్పున మొత్తం రూ.2,52,900 ఆర్థిక సహాయాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అలాగే గుడిహత్నూర్ మాజీ ఎంపీపీ, సర్పంచ్ ఆడే శీల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి గుడిహత్నూర్కు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.50,500 ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, అవసరమైన వారికి చేయూతనందించడంలో ఆడే కుటుంబం, ఆడే సకారం ఫౌండేషన్ అందిస్తున్న సేవలను స్థానికులు, ప్రముఖులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆడే కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా దాసరి రమేష్

**భీంపూర్:** భీంపూర్ మండల సర్పంచుల సంఘం నూతన మండల అధ్యక్షుడిగా పిప్పల్ కోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సర్పంచుల అత్యవసర సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియను ఏకగ్రీవంగా పూర్తి చేశారు. మండలంలోని సర్పంచులందరూ రమేష్ అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు దాసరి రమేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందరినీ కలుపుకుంటూ మండలాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని అన్నారు. రమేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, గ్రామస్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# 31లోగా రేషన్ కార్డులకు ఈ-కేవైసీ తప్పనిసరి

- గడువు దాటితే ఉచిత రేషన్ సదుపాయం నిలిచిపోయే అవకాశం




**కెరమెరి:** మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ఈనెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయని కార్డులపై ఉచిత రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటం, బోగస్ రేషన్ కార్డులను గుర్తించడం, ఆధార్తో బయోమెట్రిక్ వివరాలను అనుసంధానం చేయడం, రేషన్ కార్డులోని సభ్యుల అర్హతను కొనసాగించడమే ఈ-కేవైసీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ సమీపంలోని రేషన్ షాప్కు వెళ్లి రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుని ఆధార్ కార్డు, బయోమెట్రిక్ వివరాలతో ఈ-పోస్ యంత్రం ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మీసేవ, ఈ-సేవ కేంద్రాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వృద్ధులు, వేలిముద్రలు నమోదు కాని వారికి ఐరిస్ స్కానింగ్ ద్వారా, గ్రామస్థాయి సిబ్బంది సహాయంతో ఈ-కేవైసీ పూర్తి చేసే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని రేషన్ కార్డు లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# నిద్ర పట్టడం లేదా.. ఈ డ్రింక్స్ ట్రై చేయండి

ఈ రోజుల్లో నిద్రపట్టకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆఫీసులో తీవ్ర ఒత్తిడిలో పనిచేసి ఇంటికొస్తే.. ఇంట్లో కూడా సరైన నిద్రపట్టకపోతే నరకంలా ఉంటుంది. ఇక సరైన నిద్రలేకపోతే అనేక ఇతర అనారోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. అందుకే నిద్ర పట్టాలంటే కొన్ని డ్రింక్స్ సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ డ్రింక్స్ ఏమిటో ఇప్పుడు చూసేద్దాం..



## లావెండర్ టీ

లావెండర్ మంచి సువాసనను కలిగి ఉంటుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సాయపడుతుంది. నిద్రకు ముందు లావెండర్ టీ తాగడం వల్ల మనస్సు, శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రకు ఒక గంట ముందు ఈ టీని తీసుకోవడం మంచిది. లావెండర్ టీ కూడా యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సాయపడుతుంది.

## పిప్పరమింట్ టీ

పిప్పరమింట్ టీ రిఫ్రెష్‌గా ఉండటమే కాదు.. మీ కండరాలను రిలాక్స్ చేయడంలో సాయపడుతుంది. అలాగే, టెన్షన్‌ను తగ్గించగలదు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రపోయే ఒక గంట ముందు సాయంత్రం ఈ టీని సేవించడం ఉత్తమం. పిప్పరమింట్ టీ కూడా జీర్ణక్రియకు సాయపడుతుంది. ప్రేగు సిండ్రోమ్ లక్షణాలను కూడా తగ్గిస్తుంది.





## అశ్వగంధ టీ

అశ్వగంధ అనేది అడాప్టోజెనిక్ హెర్బ్. శరీరంలో ఒత్తిడిని తగ్గించి విశ్రాంతిని కలిగిస్తుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. ఒత్తిడికి సంబంధించిన హార్మోన్, మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. నిద్రవేళకు ఒక గంట ముందు సాయంత్రం సమయంలో ఈ అశ్వగంధ టీని సేవించడం ఉత్తమం. అశ్వగంధ టీ మానసిక స్థితిని మెరుగుపరచడంలో అద్భుతంగా

## అల్లం టీ

అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, డైజెస్టివ్ గుణాలు ఉన్నాయి. కండరాలను రిలాక్స్ చేయడంతో పాటు మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. నిద్రించే ముందు అల్లం టీ తాగడం వల్ల అజీర్ణం, ఉబ్బరం తగ్గుతుంది. ప్రశాంతమైన నిద్ర పోవచ్చు. నిద్రకు ఒక గంట ముందు సాయంత్రం ఈ అల్లం టీని సేవించాలి. అల్లం టీ కూడా వికారం తగ్గించడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సాయపడుతుంది.





## పసుపు పాలు

పాలు, దాల్చినచెక్క, అల్లం వంటి ఇతర సుగంధ ద్రవ్యాలతో పసుపు కలపాలి. అప్పుడు గోల్డెన్ మిల్క్ మాదిరిగా మారుతాయి. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. మంచి నిద్రను అందిస్తుంది.ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. నిద్రపోయే ముందు ఈ పసుపు పాలు తాగడం వల్ల వాపు తగ్గుతుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. నిద్రించే ఒక గంట ముందు ఈ పసుపు పాలను సేవించడం ఉత్తమం. జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సాయపడుతుంది.

# స్కిన్ క్యాన్సర్.. లక్షణాలు ఇవే..!

ఇటీవల క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. స్కిన్ క్యాన్సర్ డేంజర్ బెల్స్ కూడా మోగుతున్నాయి. ఏ క్యాన్సర్ అయినా ప్రారంభదశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. అసలు స్కిన్ క్యాన్సర్ లక్షణాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. చాలా మంది పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్కిన్ క్యాన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయ్.



**పుట్టుమచ్చలు రంగు మారుతున్నాయా?**

కొందరిలో ఉన్నట్టుండి పుట్టుమచ్చల కలర్ మారుతూ ఉంటుంది. సైజు, రంగు కూడా మారుతుంటాయి. ఇలా జరిగితే పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరని డాక్టర్లు చెబుతున్నారు. అమెరికాలో చర్మవ్యాధికి సంబంధించిన అమెరికాన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ విభాగం వారు స్కిన్ క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలపై స్పష్టతనిచ్చారు. 30 ఏళ్ల తరువాత చర్మంపై ఏదైనా మచ్చ వచ్చి అది క్రమంగా పెరగడం లేదా దాని రంగులో మార్పు రావడం జరుగుతుందంటున్నారు. కొత్త పుట్టుమచ్చలు వస్తే దా1నికి అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. చర్మంపై ఎప్పుడు కొత్తగా పుట్టుమచ్చలు వచ్చినా వాటిని గమనిస్తూనే ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చర్మంపై చిన్న కురుపులా వచ్చి అది ఎన్ని రోజులైనా మానకపోతే వైద్యులను వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలి. బాసల్ సెల్ కార్సినోమా, స్క్వామోస్ సెల్ కార్సినోమాలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.

**దురద, దుద్దుర్లు**

స్కిన్ క్యాన్సర్ వచ్చినట్టయితే చర్మం ఎక్కువగా దురదపెడుతుంది. కొన్ని ప్రదేశాల్లో దద్దుర్లు వస్తాయ్. సాధారణంగా చర్మంపై కురుపులు వచ్చినా దద్దుర్లు వచ్చినా కొన్ని రోజుల్లో తగ్గిపోతాయ్. ఒక వేల ఎంతకీ తగ్గకపోతే అప్పుడు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

# డైవర్స్ కు కారణాలివే..

ఇటీవల భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం వెరీ కామన్ అయిపోయింది. చాలా సిల్లీ రీజన్స్‌తో విడిపోయేవారూ ఉన్నారు. బలమైన కారణాలతోనూ దూరమయ్యేవారూ ఉన్నారు. అయితే ముఖ్యంగా ఐదు కారణాల వల్ల భార్యాభర్తలు విడిపోతున్నారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. ఆ కారణాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..



కమ్యూనికేషన్ గ్యాప్

చాలా జంటలు కేవలం ఒకరితోఒకరు మనసువిప్పి మాట్లాడుకోకపోవడం వల్లే విడిపోతున్నారట. ఒకరి భావాలు మరొకరు అర్థం చేసుకోకపోవడం.. భావాలను వ్యక్తపరుచుకోకపోవడం వల్ల ఒకరిని మరొకరు అర్థం చేసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారంట. కమ్యూనికేషన్ గ్యాప్ విడాకులకు ప్రధాన కారణం అవుతున్నదని తెలుస్తోంది.

**పరస్పర గౌరవం లేకపోవడం**

భార్యాభర్తల మధ్య ఒకరిమీద మరొకరికి గౌరవం ఉండాలి. లేదంటే ఆ సంబంధం ఎక్కువ కాలం నిలబడదు. చాలా డివోర్స్ కేసుల్లో ఒకరిమీద ఒకరికి గౌరవం లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది.

**ఆర్థిక అభద్రత**

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నిరంతరం తగాదాలు, ఖర్చులు సరిపోకపోవడం, ఆర్థిక లక్ష్యాలను చేరుకోలేకపోవడం - ఇవన్నీ ఇద్దరు వ్యక్తుల మధ్య చాలా ఉద్రిక్తతను పెంచుతాయి, తద్వారా సంబంధాన్ని కాపాడుకోవడం కష్టం అవుతుంది.

**కుటుంబ జోక్యం**

భార్యాభర్తల మధ్య విబేధాలు రావడానికి కుటుంబసభ్యుల అతి జోక్యం కూడా ఓ కారణం అవుతోంది. భార్య తరఫు వాళ్లు, లేదంటే భర్త తరఫు వాళ్లు.. ఇలా ఇద్దరి తరఫు వాళ్లు విబేధాలకు కారణం అవుతున్నారు. భార్య ప్రతి విషయానికి తన తల్లి లేదా సోదరి మీద ఆధారపడటం.. భర్త సైతం ప్రతి విషయానికి తన తల్లిదండ్రుల మీద డిపెండ్ అవ్వడం.. వాళ్లు కూడా అతి జోక్యం చేసుకుంటుండటంతో విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయి. వీరి వ్యవహారశైలి కూడా



# ల్యాప్ ట్యాప్‌ను ఒళ్లో పెట్టుకుంటున్నారా?

ల్యాప్ ట్యాప్ లేకుండా ప్రస్తుతం ఎవరూ ఉండటం లేదు. అంతగా ల్యాప్ ట్యాప్ దైనందిన జీవితంలో భాగంగా మారిపోయింది. వర్క్ ఫ్రం హోం కల్చర్ వచ్చిన తర్వాత ల్యాప్ ట్యాప్ వాడకం మరింత పెరిగింది. అయితే ల్యాప్ ట్యాప్ ను చాలా మంది ఒళ్లో పెట్టుకొని పనిచేస్తుంటారు. ఇది చాలా డేంజర్ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల లేనిపోని వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు అయటన్నారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ల్యాప్టాప్ ను గంటల తరబడి మగవారు ఒడిలో పెట్టుకోవడం వల్ల వారి పునరుత్పత్తి ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది. నిరంతరం వేడికి గురికావడం వల్ల వృషణాల్లో ఉష్ణోగ్రత పెరుగుతుంది. అలాగే పురుషుల స్పెర్మ్ కౌంట్ తగ్గుతుంది. అలాగే స్పెర్మ్ నాణ్యత కూడా చాలా వరకు తగ్గుతుంది. ఎందుకంటే పురుష పునరుత్పత్తి వ్యవస్థ ఉష్ణోగ్రత వైవిధ్యాలకు చాలా సున్నితంగా ఉంటుంది. స్పెర్మ్ ఉత్పత్తి, పనితీరుకు వాతావరణం చల్లగా ఉండటం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ల్యాప్ టాప్ ను ఒడిలో పెట్టుకున్నప్పుడు దాని నుంచి వచ్చే వేడి వృషణాల్లో ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఇది 'స్క్రోటల్ హైపర్థెర్మియా' అని పిలువబడే సమస్యకు దారితీస్తుంది. ఇది ఫలదీకరణానికి ఆటంకం కలిగిస్తుంది. అలాగే స్పెర్మ్ ఉత్పత్తి కూడా బాగా తగ్గుతుంది. అంతేకాకుండా ల్యాప్ టాప్ లు తరచుగా విద్యుదయస్కాంతత్వాన్ని విడుదల చేస్తాయి. ఇది స్పెర్మ్ ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ల్యాప్ టాప్ రేడియేషన్ కు ఎక్కువగా గురికావడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. ఇది స్పెర్మ్ కణాలను నాశనం చేస్తుంది. అలాగే వాటి చలనశీలత తగ్గుతుంది. పనితీరు కూడా ప్రభావితం అవుతుంది. అయితే ల్యాప్ టాప్ నుంచి వచ్చే వేడి, రేడియేషన్ స్పెర్మ్ నాణ్యత, పరిమాణాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై మరిన్ని పరిశోధనలు అవసరం. కానీ ల్యాప్ టాప్ ను మీ ఒడిలో పెట్టుకోవడం వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి మీరు ప్రయత్నం చేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సంతానోత్పత్తి సమస్యలు రాకూడదంటే పురుషులు ల్యాప్ టాప్ ను ఒడిలో అస్సలు పెట్టుకోకూడదు.

# గుండె ఆరోగ్యం కోసం ఈ మూలికలు తీసుకోండి



మారుతున్న జీవనశైలి, తీవ్రమైన ఒత్తిడి, సరైన ఆహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో గుండెజబ్బులు, గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. దీంతో కొన్ని రకాల మూలికలు తీసుకోవడం ద్వారా గుండె సంబంధిత జబ్బులకు దూరంగా ఉండొచ్చని ఆహార నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ కూడా మన ఆరోగ్యాన్ని కాపాడతాయి. సరైన డైట్, లైఫ్‌స్టైల్ చేంజెస్ చేయడంతో పాటు ఈ మూలికల్ని తీసుకుంటే ఇమ్యూనిటీ పెరిగి గుండె సమస్యలు కూడా దూరమవుతాయి. మరి ఆ మూలికలు ఏంటో తెలుసుకోండి.

### గుగ్గుల్..

గుగ్గుల్ అనేది ఆయుర్వేదంలో ముఖ్య మూలిక. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ధమనులని ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడకుండా ఈ మూలిక కాపాడుతుంది.

### వెల్లుల్లి..

వంటల్లో ఎక్కువగా వాడే వెల్లుల్లిలోనూ ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిదని చెప్పొచ్చు. ఆయుర్వేదంలో వెల్లుల్లిని గుండె ఆరోగ్యాన్ని కాపాడే మూలిక అని చెప్పొచ్చు. ఇది గుండె కండరాలను బలంగా చేసి రక్తపోటుని బ్యాలెన్స్ చేస్తుంది. అంతేకాకుండా గుండె రక్త నాళాల్లో కొవ్వు నిల్వలని తగ్గిస్తుంది.

### అర్జున చెట్టు..

ఈ అర్జున చెట్టునే టెర్మినలియా అర్జున చెట్టు అంటారు. ఆయుర్వేదంలో దీనికి ఎన్నో అద్భుతగుణాలు ఉన్నాయి. దీనిని వాడడం వల్ల రక్తపోటు కంట్రోల్ అవుతుంది. గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ చెట్టు బెరడుని పొడి చేసి ఆవు పాలు, తేనెతో కలిపి తింటారు. ఇది నరాలను కూడా బలంగా చేస్తుంది.

### పసుపు..

పసుపులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది అందం దగ్గర్నుంచి ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. ఇండియన్ కిచెన్‌లో ఎక్కువగా వాడే ఈ పసుపులో కర్క్యుమిన్‌తో పాటు పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి.

# శనగపిండి ప్యాక్‌తో చర్మం నిగనిగ

శనగపిండిని వంటల్లోనే కాదు.. ఫేస్ ప్యాక్ గా కూడా వాడుకోవచ్చు. ఇది చర్మాన్ని కాంతివంతం చేయడమే కాకుండా, ముడతలను తొలగిస్తుంది. మొటిమలను తగ్గిస్తుంది. ఈ పదార్థం సహజ స్క్రబ్‌గా కూడా పనిచేస్తుంది. ఇది డెడ్ స్కిన్ సెల్స్ ను తొలగించి చర్మానికి తక్షణ మెరుపునిస్తుంది. చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా మార్చడంలో శనగపిండి ప్రయోజనకరంగా ఉంటుంది. శనగపిండి చర్మాన్ని శుభ్రపరుస్తుంది. పొడిబారకుండా చేస్తుంది మరియు జిడ్డును తొలగిస్తుంది. కాబట్టి మీ రోజువారీ చర్మ సంరక్షణ దినచర్యలో శనగపిండి చేర్చుకోండి. మీ చర్మాన్ని అందంగా మార్చుకోండి. సహజమైన ఉత్పత్తి అయినందున, ఈ పదార్థం మీ చర్మానికి హాని కలిగించదు. కానీ ఎల్లప్పుడూ కొత్త ఉత్పత్తిని వర్తించే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడాన్ని పరిగణించండి.



### టాన్‌ను తొలగిస్తుంది:

వేసవిలో టాన్ నివారించడం కష్టం. ఈ సహజ పదార్థం ఈ సమస్య నుండి మిమ్మల్ని కాపాడుతుంది. పొడి చర్మం ఉన్నవారైతే పాలలో కలిపి అప్లై చేయాలి. జిడ్డు చర్మం ఉన్నవారు పెరుగులో శెనగపిండిని కలిపి రాస్తే టాన్ పోతుంది. దాంపత్యంలో అస్థిరతకు కారణం భార్య లేదా భర్త? ఈ అలవాట్లను ఈరోజు మానేయండిదాంపత్యంలో అస్థిరతకు కారణం భార్య లేదా భర్త? ఈ అలవాట్లను ఈరోజు మానేయండి. మొటిమలకు ప్రధాన కారణం అధిక నూనె ఉత్పత్తి. శనగ పిండిని మీ చర్మంపై అప్లై చేయడం వల్ల దానిలోని శోషక గుణాల వల్ల మొటిమలను నివారించవచ్చు. చర్మానికి అప్లై చేసినప్పుడు, ఇది అదనపు నూనెను గ్రహిస్తుంది మరియు మృదుత్వాన్ని తొలగిస్తుంది. మటన్ లివర్ పెప్పర్ ఫ్రై ఇలా చాలా సింపుల్ గా రుచిగా తయారుచేసుకోండి. కఠినమైన రసాయనాలకు బదులుగా మృత చర్మ కణాలను వదిలించుకోవడానికి శనగ పిండిని సహజ స్క్రబ్‌గా దీన్ని వాడుకోవచ్చు.

# ఫిల్టర్ కాఫీ ఇలా తయారు చేయండి

ఫిల్టర్ కాఫీ ఇష్టపడేవారు ఎందరో.. ఏ ఫేమస్ రెస్టారెంట్ లోనో తాగడం తప్ప.. ఇంట్లో స్వయంగా తయారు చేసుకోవడం చాలా మందికి తెలిసి ఉండదు. అందుకే ఇంట్లోనే ఫిల్టర్ కాఫీని ఎలా చేసుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం..

కావలసిన పదార్థాలు
కాఫీ పొడి, పాలు,
చక్కెర - 2 టేబుల్ స్పూన్లు, నీరు - 1/2 కప్పు
కాఫీ చేయు యంత్రము (కాఫీ మిషన్)




### ఫిల్టర్ కాఫీ ఎలా తయారు చేయాలి?

1. ముందుగా ఫిల్టర్ కాఫీ చేయడానికి కాఫీ మేకర్ కావాలి. కాఫీ తయారీదారులు ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయి. మీరు కేవలం రూ. 500కే బెస్ట్ కాఫీ మేకర్స్‌ని పొందవచ్చు. స్టీల్ కాఫీ మేకర్ కలిగి ఉండటం మంచిది. ఈ కాఫీ మేకర్ లోపల రెండు చెంచాల కాఫీ పొడి వేసి మూతతో నొక్కండి. ఒక పాత్రలో కొంచెం నీళ్లు పోసి స్టవ్ మీద పెట్టాలి. నీటిని వేడెక్కనివ్వండి.

2. కాఫీ మేకర్‌లో వెచ్చని నీటిని పోసి మూత మూసివేయండి. మీరు ఎంత తక్కువ నీరు కలుపుకుంటే, కాఫీ అంత స్ట్రాంగ్ గా ఉంటుంది. అంటే ఎక్కువ నీరు కలిపితే కాఫీ స్ట్రాంగ్ గా ఉండదు. పల్చగా ఉంటుంది.

3. తర్వాత ఒక పాత్రలో పాలు పోసి స్టవ్ మీద పెట్టాలి. అందులో పంచదార వేసి మరిగించాలి. పాలు మరుగుతున్నప్పుడు, కాఫీ మేకర్ నుండి డికాక్షన్ తీసి, ఒక గ్లాసులో వేసి, మరుగుతున్న పాలను అందులో వేయండి. రెండు సార్లు బాగా తిరగొట్టాలి. ఫిల్టర్ కాఫీ రెడీ అయిపోయినట్టే.

# వెస్టిండీస్ చేతిలో పాక్‌కు షాక్





**ఢిల్లీ, జూలై 29 (ఉద్యమ కెరటం):** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో పాకిస్థాన్ క్రికెట్ జట్టు పరిస్థితి అత్యంత ఘోరంగా తయారైంది. వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోని తొలి పోరులో పాకిస్థాన్ 90 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ డబ్ల్యూటీసీ సైకిల్‌లో పాకిస్థాన్‌కు ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. వెస్టిండీస్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా పాయింట్ల పట్టిక స్థానాల్లో ఎలాంటి పెద్ద మార్పులు లేవు. పాకిస్థాన్ ఆడిన 5 మ్యాచ్‌లలో కేవలం ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసి, 6.67 గెలుపు శాతంతో 9 జట్ల పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. వెస్టిండీస్ జట్టు ఈ విజయంతో తన గెలుపు

## డబ్ల్యూటీసీలో అట్టడుగుకు పతనం

శాతాన్ని స్వల్పంగా పెంచుకున్నప్పటికీ 22.73 శాతంతో 8వ స్థానంలోనే ఉంది. మరోవైపు ఈ సైకిల్‌లో ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆసీస్ ఆడిన 8 మ్యాచ్‌లలో 7 విజయాలు సాధించి 87.50 గెలుపు శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుత ఛాంపియన్ దక్షిణాఫ్రికా 4 మ్యాచ్‌లలో 3 గెలిచి 75 శాతం విజయాలతో రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 6 మ్యాచ్‌లలో 4 విజయాలతో 72.22 శాతంతో మూడో స్థానంలో ఉండగా, బంగ్లాదేశ్ 4 మ్యాచ్‌లలో 2 గెలిచి 58.33 శాతంతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత జట్టు పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. భారత్ ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌లలో 4 విజయాలు, 4 ఓటములు, ఒక డ్రాతో 48.15 గెలుపు శాతాన్ని కలిగి ఉంది. శ్రీలంక జట్టు 41.67 గెలుపు శాతంతో ఆరో స్థానంలో నిలవగా, ఇంగ్లాండ్ జట్టు ఆడిన 13 మ్యాచ్‌లలో కేవలం 4 మాత్రమే గెలిచి 24.36 గెలుపు శాతంతో ఏడో స్థానంలో పరిమితమైంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధిస్తాయి. ఇప్పటివరకు జరిగిన సీజన్లలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఈ డబ్ల్యూటీసీ ట్రోఫీని గెలుచుకున్నాయి. ప్రస్తుత సైకిల్ ఫైనల్ పోరు 2027లో ఇంగ్లాండ్‌లోని ఓవల్ మైదానంలో జరగనుంది.

# 'ఫేక్ ఎడ్జ్' వివాదంలో కొత్త ట్విస్ట్..

**ఢిల్లీ, జూలై 29:** ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో సంచలనం సృష్టించిన 'ఫేక్ ఎడ్జ్' వివాదం కొత్త మలుపు తిరిగింది. బ్యాట్‌కు బంతి తగలకపోయినా, స్లిప్‌లో ఉన్న ఫీల్డర్ చేతి వేళ్లతో చిటికె వేసి ఎడ్జ్ అయినట్లు శబ్దం సృష్టించి బ్యాటర్లను అవుట్ చేయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నార్త్ యార్క్‌షైర్ అండ్ సౌత్ డర్హామ్ క్రికెట్ లీగ్ అధికారిక విచారణ ప్రారంభించింది. వైరల్ వీడియోలో కనిపించిన ఆటగాడు సాల్ట్‌బర్న్ క్రికెట్ క్లబ్ సెకండ్ ఎలెవన్‌కు చెందిన బ్రియాన్ డివైన్ అని తెలుస్తోంది. ఈ ఘటనకు అతడే కారణమని ఆరోపణలు రావడంతో అభిమానులు అతడికి వ్యంగ్యంగా 'క్లిక్కీ పాంటింగ్' అనే పేరు పెట్టారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరును పోల్చుతూ ఈ పేరు సోషల్ మీడియాలో విస్తృతంగా ట్రెండ్ అవుతోంది. మిడిల్స్‌బ్రో క్రికెట్ క్లబ్ సెకండ్ ఎలెవన్ కెప్టెన్ కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ, అదే మ్యాచ్‌లో ఇలాంటి ఘటనలు పలుమార్లు జరిగాయని ఆరోపించాడు. ముఖ్యంగా యువ బ్యాటర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఈ చర్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. వివాదం తీవ్రరూపం దాల్చడంతో బ్రియాన్ డివైన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక భారతీయ రెస్టారెంట్ 'స్పైసెస్' అతనికి అందిస్తున్న స్పాన్సర్‌షిప్‌ను ఉపసంహరించుకున్నట్లు బ్రిటిష్ మీడియా వెల్లడించింది.

## ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆటగాడికి స్పాన్సర్‌షిప్ రద్దు






మరోవైపు ప్రముఖ బ్రిటిష్ టీవీ వ్యాఖ్యాత పీసర్ మోర్గన్ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ, "క్లిక్కీ పాంటింగ్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద మోసగాడు. ఇలాంటి పని అతను ఎంతకాలంగా చేస్తున్నాడు? ఎంతమంది బ్యాటర్లను ఇలా అవుట్ చేశాడు?" అంటూ సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఈ వ్యవహారంపై అధికారిక ఫిర్యాదు అందిందని, పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని నార్త్ యార్క్‌షైర్ అండ్ సౌత్ డర్హామ్ క్రికెట్ లీగ్ ప్రకటించింది. విచారణ పూర్తయ్యే వరకు ఈ అంశంపై మరిన్ని వ్యాఖ్యలు చేయబోమని స్పష్టం చేసింది.

# రూ.2 లక్షల కోట్ల దిశగా ఐపీఎల్

## బ్రాండ్ విలువలో నంబర్‌వన్‌గా ఆర్సీబీ

**ఢిల్లీ, జూలై 29:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచ క్రీడా రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకీ విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వ్యాల్యుయేషన్ స్టడీ ప్రకారం, ఐపీఎల్ మొత్తం వ్యాపార విలువ తొలిసారిగా 20.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.97 లక్షల కోట్లు) చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం వృద్ధి. లీగ్ స్టాండ్‌అలోన్ బ్రాండ్ విలువ కూడా 4.3 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.41,106 కోట్లు) చేరి 10.3 శాతం పెరిగింది.

### ఆర్సీబీ అగ్రస్థానం

ఐపీఎల్ ఫ్రాంచైజీల బ్రాండ్ విలువలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 312 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో 300 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన తొలి ఐపీఎల్ జట్టుగా ఆర్సీబీ చరిత్ర సృష్టించింది. ఇటీవల బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ గ్రూప్ కన్సార్టియం ఆర్సీబీను 1.78 బిలియన్ డాలర్ల విలువతో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

### కేకేఆర్ మూడో స్థానానికి

2026 సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా ఐదు టైటిళ్లు, బలమైన వాణిజ్య భాగస్వామ్యాల కారణంగా ముంబై ఇండియన్స్ 264 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో రెండో స్థానంలో నిలిచింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 245 మిలియన్ డాలర్ల విలువతో మూడో స్థానానికి చేరగా, చెన్నై సూపర్ కింగ్స్ 244 మిలియన్ డాలర్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. వరుసగా రెండో సీజన్‌లో పేలవ ప్రదర్శన, ఎంఎస్ ధోనీ మైదానంలో పాత్ర తగ్గడం సీఎస్కే వాణిజ్య విలువపై ప్రభావం చూపినట్లు నివేదిక వెల్లడించింది.

### ఇతర జట్ల బ్రాండ్ విలువ

మిగతా జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 168 మిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ 161 మిలియన్ డాలర్లతో ఆరో స్థానం, పంజాబ్ కింగ్స్ 158 మిలియన్ డాలర్లతో ఏడో స్థానం, గుజరాత్ టైటాన్స్ 157 మిలియన్ డాలర్లతో ఎనిమిదో స్థానం దక్కించుకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ 156 మిలియన్ డాలర్లతో తొమ్మిదో స్థానంలో ఉండగా, లక్నో సూపర్ జెయింట్స్ 122 మిలియన్ డాలర్లతో చివరి స్థానంలో నిలిచింది.

### డిజిటల్ వ్యూయర్‌షిప్‌లో రికార్డులు

2026 సీజన్‌లో ఐపీఎల్ డిజిటల్ వ్యూయర్‌షిప్ కూడా కొత్త రికార్డులు నమోదు చేసింది. మొత్తం 1.06 బిలియన్ స్క్రీన్లకు ఐపీఎల్ చేరుకోగా, గత ఏడాదితో పోలిస్తే వీక్షకుల సంఖ్య 7 శాతం పెరిగింది. ముఖ్యంగా కనెక్టెడ్ టీవీ వీక్షణ 26 శాతం పెరగడం, సంప్రదాయ టెలివిజన్ వీక్షణ తగ్గడం డిజిటల్ వేదికల ఆధిపత్యాన్ని మరింత బలపరిచింది. ఈ పరిణామాలతో ప్రపంచంలో అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఐపీఎల్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.



# జాతీయ జట్టుకు వీడ్కోలు: నెయ్‌మార్

ఫుట్‌బాల్ బ్రెజిల్ జాతీయ జట్టుకు వీడ్కోలు పలుకుతున్నట్లు దిగ్గజ క్రీడాకారుడు నెయ్‌మార్ (34) జూనియర్ తెలిపాడు. 16 ఏండ్ల కెరీర్ నుంచి రిటైర్ అవుతున్నట్లు అతడు అధికారికంగా బుధవారం వెల్లడించాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు. ఫిఫా వరల్డ్ కప్-2026లో లీగ్ దశలో బ్రెజిల్ నార్వే చేతిలో 2-1 తేడాతో ఓడిపోయింది. దీంతో వరల్డ్ కప్ నుంచి బ్రెజిల్ నిష్క్రమించింది. అప్పుడు జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. దేశం తరఫున చెమటోడ్చాను, పసుపు రంగు జెర్సీ వేసుకొని పోరాడాను. ఇక ఆ జెర్సీని ధరించను అని అన్నాడు. ఫుట్‌బాల్ ప్రపంచకప్, కోపా అమెరికా, ఒలింపిక్స్‌లలో ఆడాడు. కోపా సుండామెరికానా టోర్నీలో శాంటోస్ (ఘ్రుత్శీం) క్లబ్ తరఫున ఆడగా 4-2 తేడాతో యూనివర్సిడాడ్ సెంట్రల్ జట్టు ఓడిపోయింది. ఈ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో సహచర యువ ఆటగాళ్లను వెక్కిరించి, బెదిరించాడని వచ్చిన వార్తలను అతడు ఖండించిన సందర్భంగా జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్‌ను ప్రకటించాడు. నెయ్‌మార్ జూనియర్ బ్రెజిల్ జాతీయ జట్టు తరఫున 2010లో అరంగేట్రం చేశాడు. 2013 ఫిఫా వరల్డ్ కప్‌లో విజయం సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. 2016 రియో ఒలింపిక్స్ (=అశీ రాశ్రీఎఐజూఅఎం)లో స్వర్ణం సాధించి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్రెజిల్ తరఫున నెయ్‌మార్ 130 మ్యాచ్‌లు ఆడి 80 గోల్స్ సాధించాడు.



# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సర్ల జోరు..

## సెమీస్‌కు సాక్షి, అరుంధతి.. ● మరో రెండు పతకాలు ఖాయం

**ఢిల్లీ, జూలై 29:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్లు మరోసారి అద్భుత ప్రదర్శనతో మెరిశారు. మహిళల 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, 66 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి సెమీఫైనల్‌కు చేరుకుని భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయం చేశారు. క్వార్టర్ ఫైనల్లో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన కైట్‌లిన్ ఫ్రయర్స్‌పై సాక్షి చౌదరి 5-0 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. తన ఎత్తు, రీచ్‌ను సమర్థంగా వినియోగించుకున్న సాక్షి తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. చురుకైన ఫుట్‌వర్క్, కచ్చితమైన పంచ్‌లతో మ్యాచ్‌ను తన నియంత్రణలో ఉంచుకుని సెమీస్‌కు అర్హత సాధించింది. మరో క్వార్టర్ ఫైనల్లో అరుంధతి చౌదరి న్యూజిలాండ్‌కు చెందిన మోర్గాన్ హెండర్సన్‌పై 3-1 తేడాతో విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన పోరులో కీలక సమయాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన అరుంధతి చివరకు పైచేయి సాధించి చివరి నాలుగులోకి ప్రవేశించింది. ఇప్పటికే 75 కేజీల విభాగంలో లవ్లీనా బోర్గొహైన్, 60 కేజీల్లో ప్రియా ఘంఘాస్, 54 కేజీల్లో ప్రీతి పవార్, 55 కేజీల్లో జాదుమణి సింగ్ కూడా సెమీఫైనల్‌కు చేరడంతో భారత బాక్సింగ్ జట్టు పతకాల వేటలో దూసుకుపోతోంది. ఈ విజయాలతో బాక్సింగ్‌లో భారత్‌కు కనీసం ఐదు పతకాలు ఖాయమయ్యాయి.



# యాక్టింగ్ నేర్పిస్తానంటూ వేధింపులు

## మేనమామ చేసిన పనికి కన్నీళ్ళు పెట్టుకున్న శివాంగి





**ముంబై, జూలై 29:** ప్రముఖ టెలివిజన్ నటి శివాంగి జోషి తన చిన్ననాటి చేదు అనుభవాలను వెల్లడిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న 'లాక్ అప్ 2' రియాలిటీ షోలో పాల్గొంటున్న ఆమె, చిన్నతనంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులతో పాటు తనపై జరిగిన లైంగిక వేధింపుల ఘటనను పంచుకున్నారు. 'యే రిష్తా క్యా కెహ్లాతా హై', 'బర్సాత్', 'బడే అచ్ఛే లగ్తే హై 2' వంటి సీరియళ్లతో గుర్తింపు పొందిన శివాంగి మాట్లాడుతూ, ఒక దశలో తన తండ్రి వ్యాపారం నష్టాల్లోకి వెళ్లడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని చెప్పారు. ఆ సమయంలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కుటుంబాన్ని నిలబెట్టారని, ప్రస్తుతం తానే కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపారు. అనంతరం తన చిన్ననాటి అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, తన తల్లి దత్తత సోదరుడిగా పరిచయమైన వ్యక్తి తనతో అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపించారు. నటిగా ముంబైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న రోజుల్లో డ్రైవింగ్ నేర్పిస్తాననే పేరుతో తనను అసౌకర్యానికి గురిచేసేవాడని తెలిపారు. ఒక రోజు ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఆ వ్యక్తి తన వద్దకు వచ్చి, సినీ పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని చెబుతూ తనతో అనుచితంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించాడని శివాంగి ఆరోపించారు. నటిగా ఉండాలంటే ఇలాంటి విషయాలకు సిద్ధంగా ఉండాలని చెప్పి తనను ముద్దుపెట్టుకునేందుకు ప్రయత్నించాడని తెలిపారు. దీంతో తాను అతడిని ఎదిరించి కొట్టానని, అనంతరం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పరిస్థితిని తెలుసుకుని అతడిని అక్కడి నుంచి పంపించారని కన్నీటి పర్యంతమయ్యారు. ఆ ఘటన తర్వాత చాలా రోజుల పాటు ఇంటి బయటకు వెళ్లేందుకు కూడా భయపడ్డానని, పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండేదానినని శివాంగి తెలిపారు. అప్పటి నుంచి తన భద్రత విషయంలో కుటుంబ సభ్యులు మరింత జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. శివాంగి జోషి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. అయితే ఆమె ఆరోపణలపై సంబంధిత వ్యక్తి నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన వెలువడలేదు.




# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం

విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌గీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# నాని 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్?

## మరోసారి రిపీట్ కానున్న 'దసరా' మ్యాజిక్!

**హైదరాబాద్, జూలై 29 (ఉద్యమ కెరటం):** హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై భారీ హైప్ నెలకొనగా, తాజాగా మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలోని ప్రత్యేక గీతంలో కీర్తి సురేష్ కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. నిర్మాణ పనులు ఊహించిన దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల వాయిదా పడినప్పటికీ, వరుస అప్‌డేట్‌లు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, చిత్రంలోని ప్రత్యేక గీతం కోసం కీర్తి సురేష్‌ను చిత్ర బృందం సంప్రదించగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. 'దసరా' సినిమాలో వెన్నెల పాత్రతో కీర్తి సురేష్ ప్రశంసలు అందుకోవడంతో పాటు, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఆమెకు మంచి అనుబంధం ఏర్పడింది. అలాగే హీరో నానితో 'నేను లోకల్'లోనూ కలిసి నటించిన అనుభవం ఉంది. ఈ పరిచయమే స్పెషల్ సాంగ్‌కు ఆమె అంగీకరించడానికి కారణమై ఉండొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పాటకు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూరుస్తుండటంతో, ఇది చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ప్రచారం సాగుతోంది. కథకు అనుసంధానంగా ఉండేలా ఈ గీతాన్ని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక 'ది ప్యారడైజ్'లో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరోవైపు కీర్తి సురేష్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిగీగా ఉన్నారు. అయినప్పటికీ 'ది ప్యారడైజ్'లో స్పెషల్ సాంగ్ చేస్తారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఈ ప్రచారం నిజమైతే 'దసరా' కాంబో మరోసారి ప్రేక్షకులను అలరించనుందని





This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com